

నేటి దినపత్రిక
19వ వసంతంలోకి ...
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 6 జనవరి 2026 

### లంచాలు లాంచనంగా మారిన
# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- పై స్థాయి వరకు వాటాలు అంటూ ప్రజల సహనానికి తుది పరీక్ష
- రిజిస్ట్రేషన్ అంటేనే లంచమా....?
- డబ్బులిస్తేనే దస్తావేజుల లేకపోతే రిజెక్ట్...!
- మ్యారేజ్ సర్టిఫికెట్‌కు దందా... దారుణం
- పై అధికారుల ఆదేశాలే అంటూ వసూళ్లు అవినీతి పరాకాష్ట




**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అంటే చట్టబద్ధమైన హక్కులకు భద్రత కల్పించాల్సిన కీలక ప్రభుత్వ వ్యవస్థ. కానీ ప్రస్తుతం తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి కేంద్ర బిందువుగా, లంచాలకు లాంచనంగా మారిందన్న ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. భూమి, ఇల్లు, పెళ్లి–జీవితానికి కీలకమైన ప్రతి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ఇప్పుడు ఇక్కడ డబ్బు చెల్లిస్తేనే న్యాయం అన్న స్థాయికి చేరిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. "రిజిస్ట్రేషన్ అంటేనే లంచమా?" అన్న ప్రశ్న ఇప్పుడు సామాన్యుడి నోట ఇక్కడ వినిపిస్తోంది. చట్టం 2లో

## లో-వోల్టేజ్ సమస్యకు చెక్



రైతులకు పగటిపూట
9 గంటల నాణ్యమైన విద్యుత్
మంత్రి గొట్టిపాటి రవికుమార్ 7

## బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ సమస్యలు పరిష్కరిస్తాం.. 2లో..

కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్



## బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకువస్తాం

జనాభా దామాషా ప్రకారంగా నిధులు కేటాయింపు

'ఆదరణ-3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లు,టెక్నాలజీని అందజేత

స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో బాగస్వాములవ్వండి

బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత

వివరాలు 2లో...

## ప్రభుత్వ X ప్రైవేటు ఉత్సవ కమిటీల మధ్య వార్

### సమస్యాత్మకంగా మారనున్న రంగుల మహోత్సవ వేడుక..!

### దేవాదాయ, పోలీస్ అధికారుల తలనొప్పిగా మారనున్న వైనం





**పెనుగంచిప్రోలు: జనవరి 5 మేజర్ న్యూస్ :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవం, పెద్ద తిరునాళ్ల నిర్వహణకు శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ నాయకత్వంలో ప్రభుత్వం ఉత్సవ కమిటీని నియమించింది. ఈ కమిటీ సభ్యులుగా చుంచు రమేష్, కాకులపాటి విజయలక్ష్మి, కల్లూరీ శ్రీవాణి– (బీజేపీ) తన్నీరు గోపినాథ్–(జనసేన,) సెనగవరపు వెంకటేశ్వరావు కొలిపాక హైమ,పి అనసూయ. ఫిజె ప్రియాంక. జి రమేష్. జి పెద్ద ఆంజనేయులు, 2

(మొదటిపేజీ తరువాయి)

## ప్రభుత్వ X ప్రైవేటు ఉత్సవ కమిటీల మధ్య వార్

ఒర్సు సూరమ్మ, సరిపినేని అప్పారావు-మక్కపేట కర్నాటి కవిత- అనిగండ్ల పాదులు నియామకం చేయగా చైర్మన్‌గా చుంచు రమేష్ వ్యవహరిస్తున్నారు. అమ్మవారితో పాటు సహ విగ్రహాలు ఊరేగింపు జగ్గయ్యపేటకు బయలుదేరడం జరిగింది. ఈ ఊరేగింపులో ఉత్సవ కమిటీ సభ్యులు దేవాదాయ అధికారులతో కలిసి పర్యవేక్షణ చేస్తున్నారు. అయితే జగ్గయ్యపేటలో ఉత్సవ కమిటీ పేరుతో ఆకుల శ్రీకాంత్, ఆర్కె సతీష్, కిషోర్ల నాయకత్వంలో రాజకీయ పార్టీల నాయకులను ప్రజాప్రతినిధులను కలిసి అమ్మవారి రంగుల మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానం పలుకుతున్నారు. ఈ విషయం తెలిసి ప్రభుత్వం నియమించిన ఉత్సవ కమిటీ సభ్యులలో కొందరు ఇప్పటికే ఈ విషయాన్ని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా అమ్మవారి రంగుల మహోత్సవానికి ప్రభుత్వం నియమించిన ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించాలని పలువురు భక్తులు సభ్యులు కోరుతున్నారు. అయితే ప్రైవేటుగా ఉన్న ఉత్సవ కమిటీ సభ్యులు మాత్రం తామే చేస్తామని, జగ్గయ్యపేటలో అమ్మవారి రంగుల వేదిక వద్ద ప్రభుత్వ ఉత్సవ కమిటీ సభ్యులకు సంబంధం లేదని పేర్కొంటూ పలువురిని ఆహ్వానించడం జరుగుతుంది. ఉత్సవ కమిటీల మధ్య ఏర్పడిన అధికార వివాదం సమస్యాత్మకంగా మారనుందని.. ఈ సమస్యపై ఇప్పటికే చింత శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై దేవాదాయ, పోలీస్ శాఖ అధికారులు నిబంధనల ప్రకారం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో అమ్మవారి భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి అలాగే భక్తుల నుంచి వచ్చిన లక్షల రూపాయల విరాళాలు దారి మళ్లించే ప్రమాదం కూడా ఉంది అని భక్తులు కోరుతున్నారు.

## బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ సమస్యలు పరిష్కరిస్తాం..



పెడన, మేజర్ న్యూస్: బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, మాజీ మంత్రి కె ఎస్ జవహర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, పెడన నియోజకవర్గ శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణతో కలసి పెడన పట్టణం 10వ వార్డులోని రాజీవ్ నగర్ లో నూతనంగా నిర్మించిన బేడ (బుడ్గ) జంగం కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో షెడ్యూల్ కులాలుగా పరిగణించబడ్డారని, అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వారు కుల ధృవీకరణ పత్రాలు పొందలేకపోవడం బాధాకరమన్నారు. దీనివల్ల వారు విద్యావకాశాలతో పాటు ఇతర రంగాలలో ఎంతో నష్టపోతున్నారని, దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకుని శాశ్వత పరిష్కారం పొందే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ హక్కుల కోసం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేస్తూ వారి అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అదేవిధంగా నిధులు కోసం ఎవరిని అభ్యర్థించకుండా కుల సంఘస్తులే సొంతగా కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీకి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయకపోవడం ప్రధాన సమస్యగా ఉందని, దీనివలన ప్రభుత్వ పథకాలు పొందడంలో, విద్యా అవకాశాల్లో ఆటంకంగా మారిందని పేర్కొన్నారు. గతంలో ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని గుర్తు చేస్తూ, మరల ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, తలెత్తే ఎలాంటి సమస్యకైనా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సూపరిపాలన అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండ్రెడ్డి రామకృష్ణ,బేడ బుడ్గ జంగం కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి సత్యనారాయణ, పెడన మున్సిపల్ వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, బేడ బుడగ జంగం సంఘం ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పస్తం వాకలయ్య, సెక్రటరీ హస్తం పైడేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బయలపాటి నాని, కోశాధికారి పస్తం అబ్రహం, బేడ (బుడగ) జంగం సంఘ కార్యవర్గ సభ్యులు,పదో వార్డు పార్టీ ఇంచార్జ్ వంకా ప్రసాద్, యక్కల శ్యామలయ్య, కమ్మగంటి బాబు తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# లంచాలు లాంచనంగా మారిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



(మొదటిపేజీ తరువాయి)

కన్నా లంచమే పెద్దదిగా మారిందన్న ఆరోపణలు ఈ శాఖపై తీవ్ర మచ్చగా మారాయి. తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో లంచం ఒక వ్యవస్థీకృత పద్ధతిగా నడుస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. రేటు కార్డు బహిరంగంగా లేకపోయినా, ఎవరికెంత ఇవ్వాలో అందరికీ తెలిసిన రహస్యంగా మారిందని సమాచారం. కార్యాలయంలో ఏ పని చేయాలన్నా ముందుగా "ముట్ట" ఎంత అన్నదే కీలకంగా మారిందని బాధితులు వాపోతున్నారు. లంచం ఇవ్వని వారి ఫైళ్లకు కొర్రీలు పెట్టడం, అనవసర అభ్యంతరాలు లేవనెత్తడం, రోజులు తరబడి కార్యాలయంచుట్టూ తిప్పటం ఇక్కడ సాధారణంగా మారిందని తెలుస్తోంది. రద్దు దస్తావేజులు, సవరణ దస్తావేజుల విషయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. హద్దులు తప్పుగా నమోదైన దస్తావేజుల సవరణకు భారీ మొత్తాలు డిమాండ్ చేస్తున్నారని బాధితులు చెప్పుకుంటున్నారు. సవరణ దస్తావేజులకు "పూర్తి చలాన్ కట్టాల్సిందే" అంటూ మొదట ప్రజలను భయపెట్టి, ఆ తర్వాత నామమాత్రపు చెలానాతో పని పూర్తి చేస్తామని దానికి కొంత ముట్టజెప్పాలని సెటిల్‌మెంట్ చేసుకోవడం ఒక వ్యవస్థీకృత దందాగా ఇక్కడ మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మ్యారేజ్ సర్టిఫికెట్ విషయంలోనూ అవినీతి పరాకాష్టకు చేరిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు వేరయితే, వాస్తవంగా వసూలు చేస్తున్న మొత్తం మరోలా ఉందని బాధితులు చెబుతున్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్ కు రూ.3,500 నుంచి రూ.4,500 వరకు డిమాండ్ చేయడం సామాన్య కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. పెళ్లి లాంటి పవిత్రమైన ప్రక్రియను కూడా లంచాల వేటకు వాడుకోవడం నైతిక పతనానికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పూర్వార్జిత ఖాళీ స్థలాలు, పాత ఇళ్ల రిజిస్ట్రేషన్‌కూ ముడుపులు తప్పనిసరి చేస్తున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. చట్టబద్ధమైన హక్కులకే లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చగా మారుతోందని విమర్శలు ఉన్నాయి. లంచం ఇవ్వని వారిని రెవిన్యూ అధికారుల సర్టిఫికెట్, అదనపు డాక్యుమెంట్లు అంటూ అనవసరంగా తిప్పుతూ వేధించడం పరిపాటిగా మారిందని తెలుస్తోంది. ఒకే కార్యాలయంలో, ఒకే రకం పని కోసం కొందరికి గంటల తరబడి వేచిచూడాల్సి వస్తుండగా, "అనుకూలమైన" వారికి మాత్రం చిటికెలో పని పూర్తవడం అన్యాయానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రూఫ్ కంప్లీట్ చేయడంలో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, డబ్బులు ఇచ్చిన వారికి మాత్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా పని జరగడం లంచాల పాలనకు స్పష్టమైన సాక్ష్యంగా ఇక్కడ మారింది. పై అధికారుల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేయడం ప్రజలను విస్తుపోయేలా చేస్తోంది. "ఇది మా చేతిలో లేదుడ పై నుంచి రేట్లు వచ్చాయి" అంటూ ఇక్కడ అధికారులు మాట్లాడుతున్నారన్న ఆరోపణలు మరింత సంచలనంగా మారాయి. "డబ్బులు పెట్టి ఇక్కడికి పోస్టింగ్" తెప్పించుకున్నాండ వాటాలు అందాల్సిందే" అన్న వ్యాఖ్యలు వినిపించడం ఈ వ్యవహారం ఎంత లోతుగా వేరుకుపోయిందో తెలియజేస్తోంది. 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' దస్తావేజులు అంగీకరించకుండా, లంచం ఇస్తేనే అంగీకరించడం లేకపోతే రిజెక్ట్ చేయడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు శాఖ ప్రతిష్ఠను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. చట్టం కాపాడాల్సిన వ్యవస్థే చట్టాన్ని వేలం వేస్తున్నట్లుగా మారిందని, ఇది కేవలం అవినీతి సమస్య మాత్రమే కాకుండా పాలనా వైఫల్యంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అవినీతికి చెక్ పెట్టే విధంగా ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహం ఉద్యమాల రూపంలో బయటపడే ప్రమాదం ఉందని హెచ్చరికలు కూడా వినిపిస్తున్నాయి. "రిజిస్ట్రేషన్ అంటే లంచమేనా?" అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రభుత్వంపై ఉందని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండగా.... పలు పత్రికలలో ఈ విషయం బహిర్గతం కావడంతో పాటు ఓ సామాజిక కార్యకర్త ఈ శాఖ ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్టు వెలుగులోకి వచ్చింది...

# బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకువస్తాం



విజయవాడ, మేజర్ న్యూస్ : బీసీ కార్పొరేషన్లకు గతంలో ఎన్నడూ లేనివిధంగా పూర్వ వైభవం తీసుకువచ్చి జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. విజయవాడ రూరల్ గొల్లపూడి బీసీ సంక్షేమ భవన్ లో సోమవారం ఏపీ బెస్త సంక్షేమ & అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గా బొమ్మన్ శ్రీధర్, డైరెక్టర్లు,బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తొలుత వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత మాట్లాడుతూ...... గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. త్వరలోనే 'ఆదరణ-3' పథకాన్ని ప్రారంభించి, ఆధునిక పనిముట్లు,టెక్నాలజీని అందిస్తామని చెప్పారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బీసీల కష్టాలను పాదయాత్రలో స్వయంగా తెలుసుకున్నారని కొనియాడారు. రాష్ట్రం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో అక్రమ కేసులు, వేధింపులు జరిగాయని, బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. అమరావతి రాజధాని పనులు, పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నామన్నారు. మత్స్యకారుల ధైర్యాన్ని అభినందిస్తూ, వారి వేట విరామ సమయంలో భృతిని రూ. 10,000 నుండి రూ. 20,000 కు పెంచామని, ప్రమాద బీమాను రూ.5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల ఆధునీకీకరణ జరుగుతోందని, మెగా డిఎస్సీ ద్వారా బీసీ వర్గాలకు చెందిన వారికి ఎక్కువ ప్రయోజనం చేకూరిందని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని దీనిలో భాగంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడంతో పాటు పరిశ్రమల స్థాపనతో పారిశ్రామిక వృద్ధి సాధించే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్రానికి ఎక్కువ పెట్టుబడులు రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొట్టాలని చూసిన వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పారని మంత్రి అన్నారు. ప్రజలు ఏ నమ్మకంతో అయితే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారో, ఆ నమ్మకాన్ని ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని హామీ ఇచ్చారు. బీసీ సోదరులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిన బెస్త సంక్షేమ & అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొమ్మన్ శ్రీధర్, డైరెక్టర్లను మంత్రి అభినందిస్తూ చైర్మన్, డైరెక్టర్లు ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తారని ఆశిస్తున్నామని మంత్రి ఎస్. సవిత ఆకాంక్షించారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశ్న నరేంద్ర వర్మ మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారకరామారావు వేసిన పునాది వల్లే నేడు బీసీలకు పార్టీలో ప్రత్యేక స్థానం లభించిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సమాంతరంగా ముందుకు వెళుతున్నాయని, రాబోయే కాలంలో 13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని పేర్కొన్నారు.'సూపర్ సిక్స్' పథకాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనీసం మరో 10 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రాన్ని పాలించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మద్దతుతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడుతుందని శాసనసభ్యులు ధీమా వ్యక్తం చేశారు. డైరెక్టర్లుగా బెస్తా పవన్ కుమార్, బెస్తా శ్రీనివాసులు, బెస్తా మల్లికార్జున,బెస్తా మనోహర్, చంద్రశేఖర్, కరిమద్దెల భాస్కర్ రావు, కొడిపర్తి శ్రీధర్, మల్లె వెంకట సుబ్బయ్య, పి. అమరావతి, పి. తిరుమగళ్, పళని బొమ్మన, బెస్తా రామాంజనేయులు, సిహెచ్ సోమయ్య, టి. జి. రమేష్ బాబు లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు పాల్ శెట్టి, బెస్త సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

# కీర్తిరాయునిగూడెంలో 'వీబీ-జీ రామ్ జీ'పై గ్రామసభలో దొండపాటి రాము

**మైలవరం మేజర్ న్యూస్ :** కీర్తిరాయునిగూడెం గ్రామంలో నిర్వహించిన "వీబీ-జీ రామ్ జీ" పథకంపై గ్రామసభలో మైలవరం మాజీ జెడ్పిటిసి దొండపాటి రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో భాగంగా పాత ఉపాధి హామీ పథకంలో కీలక మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం తీసుకు వచ్చిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఇకపై ఏడాదికి 100 రోజులకు బదులుగా 125 రోజులు పాటు ఉపాధి కల్పిస్తుందని ఉపాధి కూలీలకు తెలియజేశారు. దీని ద్వారా వారి ఆదాయాన్ని 25 శాతం పెంచుతుందన్నారు. ఉపాధికి హామీ ఇవ్వటం ద్వారా కరువు కారణంగా ఏర్పడే ప్రజల వలసలను నివారిస్తుందన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రధానంగా ప్రజలకు నీటి భద్రత, గ్రామీణ ప్రధాన మౌలిక వసతులు, జీవనోపాధి మౌలిక వసతులు, వాతావరణ పరిస్థితులను స్థిరీకరించే (వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్ప్రభావాలను నిరోధించటం) పనులు అనే నాలుగు అంశాలపై ఈ పథకం దృష్టి పెట్టిందన్నారు. ఈ పథకం చెరువులు, కుంటల వంటి నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నీటి వనరుల పునరుద్ధరణ ద్వారా వ్యవసాయానికి నీటి వసతితోపాటు భూగర్భ జల మట్టం పెంచేందుకు వీలు కలుగుతుందన్నారు. పక్కా రోడ్లు, గ్రామాల అనుసంధానం, అత్యవసరమైన సేవల కల్పన ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిస్తుందన్నారు. డిజిటల్ హాజరు, కూలీలకు నేరుగా వేతనాల చెల్లింపు, డాటా ఆధారిత ప్రణాళికల ద్వారా జవాబుదారీతనాన్ని పెంచుతుందన్నారు. పంటలు వేసే, కోసే కాలాల్లో రైతులకు కూలీల కొరత రాకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు 60 రోజుల



పాటు పనులను నిలిపివేసే అవకాశం ఈ పథకం కల్పిస్తుందన్నారు. అవినీతి నిరోధానికి, మోసాలను గుర్తించేందుకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థతో పథకంపై పర్యవేక్షణకు కేంద్ర, రాష్ట్రాల సంయుక్త స్టీరింగ్ కమిటీ ఉంటుందన్నారు. ఈ పథకంపై గ్రామ పంచాయతీ పర్యవేక్షణ అధికారాలను విస్తృతం చేయటంతో పాటు జీపీఎస్, మొబైల్ ఆధారిత పర్యవేక్షణ ఉంటుందన్నారు. తద్వారా పథకం అమలులో పారదర్శకత ఉంటుందన్నారు. ఈ పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శోభనాద్రి, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు తోట మాధవరావు, ఏపీవో సుజాత, పంచాయతీ కార్యదర్శి కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మంత్లీ షెడ్యూలులో భాగంగా అవనిగడ్డ మండలంలోని కొన్ని ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమా సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు రోడ్ లోని పాత సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవి దక్షిణచిరువోలులంక ఫీడర్ యొక్క విద్యుత్ లైన్ల పై వాలిన చెట్ల కొమ్మలను ట్రిమ్ చేయడం కొరకు పాత సబ్ స్టేషన్, అవనిగడ్డ మండల పరిధిలోని రామచంద్రాపురం, వలంద పాలెం, సరదాకోడు, చిన్న మాచవరం లోని కొంతమేరకు, మేడిలంక, దక్షిణచిరువోలులంక, ఒడుగువారిపాలెం, అయ్యవారిపాలెం గ్రామములలో గృహ అవసరాలకు, వ్యవసాయ సర్వీసులకు పూర్తిగా, రామకోటిపురం, తిప్పపాలెం గ్రామములలో వ్యవసాయ సర్వీసులకు ఉదయం 08:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు విద్యుత్ అంతరాయము కలుగును కావున విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## పామర్రులో ఆత్మనిర్బర్ భారత్ - స్వయం సమృద్ధి భారత్



**పామర్రు మేజర్ న్యూస్:** మండలం పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో సోమవారం ఆత్మనిర్బర్ భారత్ సంకల్ప అభియాన్ స్వదేశీ నినాదం మన జీవన విధానం కార్యక్రమం నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ముదునూరు శివకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ వస్తువుల్ని భారతీయులందరూ వాడాలని, విదేశీ మారకద్రవ్యాన్ని మన దేశానికి సమకూర్చాలని, విదేశీ వస్తువులను బహిష్కరించాలని, స్వదేశీ ఆదరణ పెరగాలని పేర్కొన్నారు. అనంతరం బల్లిపర్రు గ్రామంలో స్వదేశీ స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల ఉపాధ్యక్షులు సందోలు శివరాం ప్రసాద్, ముదునూరు శంకరరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కలంకారి ఒక అద్భుత కళ

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్



**పెడన, మేజర్ న్యూస్:** కలంకారి ఒక అద్భుత కళాని ఈ కళ చాలా అరుదైనదని ఈ కళ లో పనిచేస్తున్న కార్మికులు కు ఎంతో నైపుణ్యం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్ అన్నారు. ఈ మేరకు పట్టణానికి వచ్చిన ఆయన బేడ బుడగ జంగం వెల్ఫేర్ అసోసియేషన్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో వార్డులో ఉన్న కలంకారి స్క్రీన్ ప్రింటింగ్ పరిశ్రమను నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తో కలిసి పరిశీలించారు. అనంతరం కార్మికులను అభినందించారు.



## ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సదుపాయాన్ని వినియోగించుకోండి..

**గన్నవరం, జనవరి 5, మేజర్ న్యూస్ :** ఏపీఎస్ఆర్టీసీలో కార్గో డోర్ డెలివరీ సదుపాయాన్ని వినియోగించుకుని ప్రయాణికులు వారి పార్సెల్లు, కొరియర్ కవర్లు అతి తక్కువ ఖర్చుతో అతి త్వరగా పంపవచ్చని గన్నవరం డిపో మేనేజర్ శివాజీ తెలియజేశారు. గన్నవరం డిపోలో నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ మాసోత్సవంలో భాగంగా సోమవారం రోజు గన్నవరం బస్ స్టేషన్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి కార్గో డోర్ డెలివరీ గురించి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచి కార్గో డోర్ డెలివరీ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్గో డోర్ డెలివరీ ద్వారా రాష్ట్రంలోని 84 ముఖ్య పట్టణాల్లో ఈ సదుపాయం ఉందని పార్సెల్,కవర్లను కస్టమర్ల ఇంటికే తీసుకెళ్లి డెలివరీ చేస్తారని ఈ సదుపాయాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరినారు. ఈ ర్యాలీలో సూపర్వైజర్లు మధు,వెంకటేశ్వ రరావు, యూనియన్ నాయకులు, డ్రైవర్లు కండక్టర్లు గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్వడంలో సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



మైలవరం మేజర్ న్యూస్ : మండలంలోని వెల్వడం గ్రామంలో పి-4 కార్యక్రమంలో భాగంగా రూ.1కోటి వ్యయంతో నిర్మించిన సిమెంట్ రహదారులను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం ప్రారంభించారు. ప్రవాసాంధ్రులు, విద్యాదాత, ప్రముఖ వైద్యులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్వగ్రామంపై మమకారంతో ఇందుకు నిధులను వెచ్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ వెల్వడం గ్రామాభివృద్ధికి హనిమిరెడ్డి చేస్తున్న కృషి ఆదర్శనీయమన్నారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది ప్రవాసాంధ్రులు వారి స్వగ్రామాల్లో పి-4 కార్యక్రమం కింద అభివృద్ధి పనులు చేపట్టాలని, పేదరిక నిర్మూలనకు సంకల్పించాలని కోరారు. అనంతరం వెల్వడంలోని డాక్టర్ హనిమిరెడ్డి నివాసంలో గ్రామస్తులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకా తిరుమల దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తల మండలి సభ్యులు, లయన్ ఎస్.వి నివృతరావు, లకిరెడ్డి జయప్రకాష్ రెడ్డి, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## సామ్‌సంగ్ నుంచి యువర్ కంపానియన్ టు ఏఐ లివింగ్

**విజయవాడ మేజర్ న్యూస్ :** విన్ లాస్ వెగాస్ వద్ద లాటూర్ బాల్‌రూమ్‌లో జరిగిన దాని సిఈఎస్ 2026 ఈవెంట్, ది ఫస్ట్ లుక్ లో సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తమ "కంపానియన్ టు ఏఐలివింగ్" విజన్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఏఐ పై దృష్టి కేంద్రీకరించటంతో పాటుగా సామ్‌సంగ్ సిద్ధాంతంగా అభివర్ణించారు. ఇది కంపెనీ ఆర్ అండ్ డి ఉత్పత్తి అభివృద్ధి, కార్యకలాపాలు, వినియోగదారు అనుభవాన్ని అనుసంధానించే పునాదిగా నిలువనుంది. సామ్‌సంగ్ డివైజ్ ఎక్స్‌పీరియన్స్ (డిఎక్స్) విభాగం సీఈఓ, హెడ్ టిఎం రోహ్, కంపెనీ ఏఐ నాయకత్వాన్ని, దాని విస్తారమైన, ఏఐ-ఆధారిత, అనుసంధానించబడిన పర్యావరణ వ్యవస్థ కారణంగా, సామ్‌సంగ్ వినియోగదారులకు వారి దైనందిన జీవితంలో నిజమైన ఏఐ సహచర అనుభవాన్ని ఎలా అందించగలదో వివరిస్తూ ది ఫస్ట్ లుక్‌ను తెరిచారు. గ్లోబల్ కనెక్ట్ చేయబడిన పర్యావరణ వ్యవస్థతో, విభిన్న విభాగాలలో ఏఐని మిళితం చేయటం ద్వారా, సామ్‌సంగ్ మరింత అర్థవంతమైన రోజువారీ ఏఐ అనుభవాలను అందించడంలో ముందుందని ఆయన అన్నారు.

## సాంకేతికతతో పర్యావరణ సుస్థిరతను తీర్చిదిద్దుతున్న యువ ఆవిష్కర్తలు

**విజయవాడ మేజర్ న్యూస్ :** దశాబ్దాలుగా పర్యావరణ సుస్థిరతను త్యాగం లేదా రాజీగా భావిస్తూ వచ్చారు. అయితే, ఐఐటి ఢిల్లీతో భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న శామ్‌సంగ్ యొక్క ప్రధాన విద్యా కార్యక్రమం శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025 ద్వారా లభించిన మద్దతు, మార్గదర్శకత్వంతో, యువ ఆవిష్కర్తలు ఈ దృక్కోణాన్ని పూర్తిగా మార్చారు. సాంకేతికత గ్రహాన్ని కాపాడుతూనే అభివృద్ధి, శ్రేయస్సును ముందుకు నడిపించగలదని నిరూపించారు. భారతదేశం అంతటా వేలాది మంది విద్యార్థులు "సాంకేతికత ద్వారా పర్యావరణ సుస్థిరత" అనే ఇతివృత్తం కింద వనరుల పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛమైన నీటి పరిష్కారాలు, కార్బన్ ఉద్గారాల తగ్గింపుపై దృష్టి సారించిన అత్యాధునిక ఆవిష్కరణలను అభివృద్ధి చేశారు. విజేతలకు ఐఐటీ ఢిల్లీలో 1 కోటి రూపాయల వరకు ఇంక్యుబేషన్ మద్దతు లభించింది, అగ్రశ్రేణి జట్లకు అదనపు అవార్డులతో పాటు, 1 లక్ష రూపాయల గ్రాంట్లు, గుడ్‌విల్ అవార్డులు, యంగ్ ఇన్నోవేటర్ అవార్డులు, టాప్ 20 జట్లకు శామ్‌సంగ్ గ్యాలక్సీ జెడ్ ఫ్లిప్ స్మార్ట్‌ఫోన్‌లు కూడా లభించాయి.

## పెద్దమద్దాలి గ్రామసభలో పలు తీర్మానాలు



**పామర్రు మేజర్ న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన గ్రామ సభల సందర్భంగా మండల పరిధిలోని పెద్దమద్దాలి గ్రామంలో జరిగిన గ్రామసభలో పలు తీర్మానాలు చేశారు. గ్రామ సర్పంచ్ బందెల జెస్సికా శాంతకుమారి అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో గ్రామంలోని పాఠశాలకు ప్రహరీ గోడలు నిర్మించాలని ఉపాధి హామీ పథకం కింద మరికొన్ని పనులను గుర్తించాలని అలాగే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి దాని అభివృద్ధి పరచా లని తదితర సమస్యలపై తీర్మానాలను చేయాలని మండల బీజేపీ అధ్యక్షు లు ముదునూరు శివకృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కె.ప్రభాకర్ కోరారు. దీనిపై ఆ సమస్యలకు సంబంధించి గ్రామ సభలో తీర్మానాలు చేశారు. ఈ గ్రామ సభలో ఎంపీటీసీ సభ్యురాలు కె.రాజ్యలక్ష్మి, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.కమల కుమారి, కె. ప్రభాకర రావు, మాజీ సర్పంచ్ బి.జయరాజు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఉద్యోగ ప్రకటన**

కృష్ణాజిల్లా సాంఘిక సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఔట్సోర్సింగ్ (పొరుగు సేవలు) అయినటువంటి నియామకాల కొరకు దరఖాస్తులు చివరి తేదీ 10.01.2026 కోరబడుచున్నాము. పోస్ట్ మరియు కొరియర్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడవు.

**నేమ్ ఆఫ్ ది పోస్టు**

కుక్ -6, కామాటి -5, వాచ్మెన్- 4

**సంప్రదించవలసిన అడ్రస్**

ఉపసంచాలకులు, సాంఘిక సంక్షేమ శాఖ, కలెక్టర్ వారి కార్యాలయం, మచిలీపట్నం.

# పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో నిలవడం రాష్ట్రానికి గర్వకారణం



**గన్నవరం, జనవరి 5, మేజర్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ముసుగులో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధ్వజమెత్తారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పెట్టుబడుల ద్వారా కూటమి ప్రభుత్వం నిలబెడుతుందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమిపై విశ్వాసంతో రాష్ట్రానికి ప్రపంచ దిగ్గజ సంస్థలు.. "ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదాను ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని చెప్పుకుంటూ ప్రెస్ మీట్‌లతో వైసీపీ నేతలు కాలయాపన చేస్తున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా-సి ఎం ఇ ఐ తాజాగా ఇచ్చిన నివేదికతో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూల రాష్ట్రమని స్పష్టమైంది. గడిచిన 9 నెలల్లోనే దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం పెట్టుబడులు ఏపీకే రావడం, దేశంలోనే నెం.1గా నిలవడం గర్వకారణం. ఇది వైసీపీ నేతలకు మింగుడు పడడం లేదు. 975 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న మన రాష్ట్రంలో నేడు యువనేత తీసుకువచ్చినన్ని కంపెనీలు గతంలో ఎన్నడూ రాలేదు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు సైతం మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువస్తున్నాయి. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కఠోర శ్రమ ఫలితంగా నేడు ప్రపంచ స్థాయి కంపెనీలు ఏపీకి వస్తుంటే, వైసీపీకి జీర్ణం కావడం లేదు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం, అభివృద్ధి జరగడం వైసీపీకి ఇష్టం లేదు. వైసీపీ హయాంలో అసలు పెట్టుబడులు కాదు కదా.. ఉన్న కంపెనీలే పారిపోయే పరిస్థితి నెలకొంది. దానికి ముఖ్య ఉదాహరణ గన్నవరం నియోజకవర్గంలోని అశోక్ లేల్యాండ్ కంపెనీ మన టీడీపీ హయాంలోనే పూర్తై ప్రొడక్షన్‌కు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ విధానాల వలన కంపెనీ ప్రారంభానికి నోచుకోలేదు. నేడు మన ప్రభుత్వం రాగానే ప్రభుత్వంపై విశ్వాసం పెరిగి సంస్థ ప్రారంభానికి ముందుకు వచ్చి ఉత్పత్తి మొదలుపెట్టింది. దీనితో పాటు మరో ఐటి కంపెనీలను మేధా టవర్స్ లో మంత్రి లోకేష్ ప్రారంభించారు. విధానాలపై విశ్వాసం, పాలనపై నమ్మకంతో తరలిపోయిన పెట్టుబడిదారులు సైతం నేడు రాష్ట్రానికి క్యూ కట్టారు. ప్రపంచం మొత్తం ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడుతుంటే ఇక్కడ మాత్రం.. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు అన్ని ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి" అని తెలిపారు.

**వైసీపీ అక్రమాలను బట్టబయలు చేసిన కాగ్ నివేదిక.**

"నాడు జగన్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చర్చించుదామంటే వైసీపీ నేతలు అసెంబ్లీకి రావడం లేదు. ప్రజా దర్బార్ అంటూ పులివెందులలో 3 రోజుల డ్రామా ఆడారు గాని, రాష్ట్ర ప్రయోజనాలకై చర్చించేందుకు అసెంబ్లీకి రావడం లేదు. మిగిలిన రోజులు అన్ని జగన్ రెడ్డి ఖాళీగానే ఉంటున్నాడు కాబట్టి కాగ్ ఇచ్చిన నివేదకను ఒకసారి చదువుకోవాలి. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలన్నింటినీ కాగ్ నివేదిక బయటపెట్టింది. సి ఎఫ్ ఎం ఎస్ లో డూప్లికేట్ బిల్లుల చెక్ లేకపోవడం వల్ల 1,41,917 బిల్లులపై రూ.968 కోట్లు అదనంగా చెల్లించారు. ఈ చెల్లింపులు 2018 నుంచి 2021 మధ్య జరిగాయి ఇది వ్యవస్థబద్ధ వైఫల్యం. పెన్షన్ల విషయంలో కూడా లిమిట్ చెక్ లేకపోవడం వల్ల 2,545 మందికి అర్హతకు మించి పెన్షన్లు ఇచ్చారు. మొత్తం నష్టం రూ.218.15 కోట్లు. ఈ పెన్షన్ మోసాల్లో 193 ట్రెజరీ అధికారులు / డి డి ఓ లు భాగస్వాములయ్యారు. బెనిఫిషియరీ వివరాలు అనధికారంగా మార్చడం వల్ల రూ.43 లక్షల ప్రభుత్వ ఆదాయం దుర్వినియోగం జరిగింది. బ్యాకెండ్ ద్వారా 1,44,493 పిడి అకౌంట్లు అనుమతి లేకుండా తెరిచారు. పి డి అకౌంట్ల సి ఎఫ్ ఎం ఎస్ నుంచి రూ.71,568 కోట్లు అధికారులకు తెలియకుండానే ల్యాప్స్ చేశారు. దీన్నిబట్టి కి సి ఎఫ్ ఎం ఎస్ లో డిజైన్ లేదు, కంట్రోల్ లేదు, బాధ్యత లేదు అని కాగ్ తేల్చింది. రాష్ట్ర రెవెన్యూ డెఫిసిట్ రూ.13,899 కోట్ల నుంచి రూ.43,487 కోట్లకు పెరిగింది. రాష్ట్రం అప్పులు తెచ్చి కూడా అభివృద్ధికి ఖర్చు చేసింది కేవలం రూ.రూ.7,244 కోట్లు మాత్రమే. అప్పులు అభివృద్ధికి కాకుండా రోజువారీ ఖర్చులు, పాత అప్పుల చెల్లింపులకే వాడారు. ఫిస్కల్ డెఫిసిట్ రూ.52,508 కోట్లకు చేరింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదంలోకి నెట్టారని కాగ్ స్పష్టం చేసింది. జగన్మోహన్ రెడ్డికి రాష్ట్రం, ప్రజలపై ఏ మాత్రం బాధ్యత ఉన్నా కాగ్ నివేదిక, లెక్కలకు సమాధానం చెప్పాలి. ఇన్ని చేసింది చాలక నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులపై విషం చిమ్ముతారా?" అని దుయ్యబట్టారు.

**పిపిపి విధానంపై నాతో**
**బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా?.**

దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో పిపిపి విధానం ద్వారా మెడికల్ కాలేజీలు అభివృద్ధి చెందుతున్నాయి. పంజాబ్‌లో 1999 నుండి పంజాబ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల, పశ్చిమ బెంగాల్‌లోని 2021 నుండి శాంతి నికేతన్ మెడికల్ కాలేజీ, ఉత్తరప్రదేశ్‌లో కెఎంసి మెడికల్ కాలేజీ పిపిపి విధానంలో అభివృద్ధి చెందుతున్నాయి. పిపిపి విధానం భేష్ అని, వీటి ద్వారా మెడికల్ కాలేజీలు వేగంగా అభివృద్ధి చేయవచ్చని కేంద్ర ప్రభుత్వం సైతం స్పష్టం చేసినా వైసీపీ మాత్రం పిపిపి మోడల్‌పై బురద జల్లుతుంది. కోటి సంతకాలు అంటూ డ్రామాలు ఆడి మెడికల్ కాలేజీల నిర్మాణంపై ప్రజలను మభ్య పెట్టాలని వైసీపీ నేతలు ప్రయత్నించారు. అసలు జగన్ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉండుంటే నీ సలహాదారులకు ఖర్చు పెట్టిన రూ.680 కోట్లతో ఒక కాలేజీని వేగంగా పూర్తి చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించవచ్చు. రుషికొండపై ఖర్చు చేసిన రూ.500 కోట్లతో ఇంకో కాలేజీని పూర్తిచేయొచ్చు. అసలు ఏ సలహాదారుడు సలహా ఇచ్చాడేమో గాని గెస్ట్ హౌస్ పేరుతో రూ.500 కోట్లు వృధా చేశారు. ఈ ప్యాలెస్‌ను నేడు ఏమి చేయాలో కూడా అర్థం గాక తలలు పట్టుకుంటున్నాము. మధ్యప్రదేశ్‌లో దార్, బీటల్, కట్నీ, పానా, గుజరాత్‌లో బ్రౌన్ ఫీల్డ్ 7 మెడికల్ కాలేజీలు పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చెందుతున్నాయి. ఇటువంటి మోడల్‌ను వైసీపీ నేతలు వ్యతిరేకించడం దారుణం. ఎక్కడైతే పిపిపి మోడల్‌లో మెడికల్ కాలేజీలు అభివృద్ధి చెందుతున్నాయో ఆ ప్రాంతాలు పిపిపి విధానంపై సంతకాల సేకరణ చేసి రాష్ట్రపతికి ఇవ్వాలి అని అన్నారు.

**చంద్రబాబు నడిపిన అభివృద్ధి బాటలోనే యువనేత పయనం.**

హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చిన నాయకుడు చంద్రబాబు. మైక్రోసాఫ్ట్‌ను తీసుకొచ్చి దేశానికి ఐటి క్యాపిటల్‌గా హైదరాబాద్‌ను నిలిపారు. హైటెక్ టవర్ నిర్మాణం అంటే కేవలం బిల్డింగ్ నిర్మాణం అని వైసీపీ నేతలు అనుకుంటారు. ఒక్క హైటెక్ టవర్ నమూనా ద్వారా ప్రపంచ దిగ్గజ కంపెనీలు, ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకొచ్చి లక్షల కోట్లలో ఐటి ఎక్స్ పోర్ట్స్ జరగడానికి కారణం అయ్యారు. ఈ గవర్నెన్స్ కు శ్రీకారం చుట్టారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విప్లవం తీసుకొచ్చారు. అదే బాటలోనే యువనేత, మంత్రి లోకేష్ బాబు కూడా పయనమవుతున్నారు. విశాఖకు టెక్ దిగ్గజం గూగుల్‌ను తీసుకొచ్చి పెట్టుబడులకు స్వర్గధామిగా ఏపీని నిలిపారు. విద్య రంగంలో నూతన సంస్కరణలకు ఆద్యం పోశారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు, కంపెనీలను ఆకర్షించి యువతకు ఉద్యోగాలు సృష్టిస్తున్నారు అని చెప్పుకొచ్చారు.

**భోగాపురంపై వైసీపీ క్రెడిట్ చోరీ..**

భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణంపై వైసీపీ నేతలు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. 2019 ఎన్నికలకు ముందు భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం జరగనివ్వమని, భూములిచ్చిన రైతులకు తిరిగి భూమి ఇస్తామని, అక్రమంగా సంపాదించుకోవడానికే జీఎంఆర్‌కు అంటూ విషం కక్కిన జగన్ రెడ్డి నేడు ఏ రకంగా క్రెడిట్ చోరీకి పాల్పడతాడు. ఐదేళ్లు భోగాపురం నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో భోగాపురం విమానాశ్రయం వేగంగా నిర్మాణం జరుగుతుంది. దాంట్లో భాగంగానే నిన్న రన్ వేపై ట్రైల్ రన్ విజయవంతంగా పూర్తి చేసుకున్నాం అని హర్షం వ్యక్తం చేశారు.



## యల్.బి.ఆర్.సి.ఈ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్ అధ్యాపకునికి పి.హెచ్.డి. ప్రదానం

**మైలవరం, మేజర్ న్యూస్ :** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగంలో అధ్యాపకులు పాముల నరేంద్ర బాబు కు మిజోరం విశ్వవిద్యాలయంలో " డెవలప్మెంట్ ఆఫ్ ఎఫిషయెంట్ ప్రొటొకాల్స్ ఇన్ ఫెడరేటెడ్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ సెక్యూర్ కమ్యూనికేషన్" అనే అంశంపై చేసిన పరిశోధనకు పి.హెచ్.డి ని ప్రధానం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. ఈ పరిశోధన ప్రొఫెసర్ అజోయ్ కుమార్ ఖాన్, మిజోరాం యూనివర్సిటీ, జాయింట్ సూపర్వైజర్ డా. అర్నిందం సర్కార్, ఆర్ కే యం విద్యామందిర, పశ్చిమ బెంగాల్ వారి పర్యవేక్షణలో జరిగింది. ఈ పరిశోధనలో ఫెడరేటెడ్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో సురక్షిత, సమర్థవంతమైన కమ్యూనికేషన్ కోసం నూతన ప్రోటోకాల్‌ల అభివృద్ధి జరిగింది. ఈ పరిశోధన డేటా ప్రైవసీని బలోపేతం చేస్తూ, పంపిణీ వ్యవస్థల్లో భద్రతా సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డా కె.అప్పారావు, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ పి భగత్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు డా.నరేంద్ర బాబు అభినందనలు తెలిపారు.

# నైనవరంలో గాంధీజీ విగ్రహానికి అవమానం





## పట్టించుకోని పంచాయతీ పాలకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం పి. నైనవరం గ్రామ పంచాయతీలో మహాత్మా గాంధీ విగ్రహానికి నిత్యం అవమానాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు, పంచాయతీ సర్పంచ్ పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున గానీ, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున గానీ పూలదండలు వేసి పూజలు చేయడమే సరిపోదని, మిగతా రోజుల్లో విగ్రహాన్ని నిర్లక్ష్యం చేయడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నైనవరం గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద చెత్తాచెదారం, ఖాళీ మద్యం బాటిళ్లు, డ్రింక్ డబ్బాలు పడేసి మందుబాబులు అవమానిస్తున్నా అధికారులు రోజూ అక్కడే తిరుగుతూ చూసీ చూడనట్టు వెళ్లిపోతుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. విగ్రహం దెబ్బతిన్నా, అక్కడే మద్యం తాగి బాటిళ్లు పడేసినా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ప్రయోజనం ఏమిటని గ్రామ పెద్దలు, మహిళలు ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పంచాయతీ సర్పంచ్ స్పందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ పాలకులు స్పందించి గాంధీజీ విగ్రహానికి కనీస గౌరవం కల్పిస్తారా? లేక అలాగే నిర్లక్ష్యం చేస్తారా? అని గ్రామ ప్రజలు ఆగ్రహంతో వేచి చూస్తున్నారు.



## అశ్వరావుపాలెంలో మద్యం బెల్ట్ షాపులను తొలగించండి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అశ్వరావుపాలెంలో బహిరంగంగా సాగుతున్న మద్యం బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులతో కలిసి స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో జరుగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గత మూడేళ్లుగా గ్రామంలోని 5 చోట్ల బెల్టు షాపులు నిరాటంకంగా నడుస్తున్నాయని, ప్రధాన రహదారిపైనే ఈ విక్రయాలు సాగుతుండటం తో విద్యార్థినులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి బెల్ట్ షాపులను తొలగించి గ్రామస్తులకు రక్షణ కల్పించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

# అధికారిక చిహ్నమైన రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు



మైలవరం మేజర్ న్యూస్ : మైలవరంలో రాష్ట్రప్రభుత్వం అధికారిక చిహ్నమైన రాజముద్రతో భూమి యాజమాన్య హక్కులను ధ్రువీకరిస్తూ పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీకి శ్రీకారం చుట్టిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మైలవరం మండలంలోని దాసుళ్లపాలెం గ్రామంలో నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ బుక్ ల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడం మన ప్రధాన లక్ష్యమన్నారు. రీ సర్వే తప్పులను సరిదిద్ది కొత్త పాసుపుస్తకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు భూ వివాదాలు లేకుండా చేయడం అనేది ప్రథమ కర్తవ్యం కావాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణి చేస్తామని, రైతులకు భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అందుకు అనుగుణంగా జనవరి 2 నుంచి పంపిణీకి కావాల్సిన నూతన పుస్తకాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసిందన్నారు. గతంలో ఇచ్చిన 21.86 లక్షల భూ హక్కు పత్రాల స్థానంలో రాజముద్రతో కొత్త పాటు క్యూఆర్ కోడ్ తో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్త పాస్ బుక్స్ ను బయోమెట్రిక్ విధానం ద్వారా అందజేస్తున్నారని, దీని ద్వారా ఈ కేవైసీ పూర్తి కాని వారికి సమస్య లేకుండా ఉంటుందన్నారు. పుస్తకాలు అందాయంటూ లబ్ధిదారులతో సంతకాలు తీసుకోవడంతో పాటు ఇది ఒక రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన పాస్ పుస్తకాలు పంపిణీ సమయంలో కూడా పట్టాదారుని వివరాలు తప్పుగా నమోదైతే వాటిపై తక్షణ చర్యలకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ల లాగిన్ ద్వారా లబ్ధిదారుల ఆధార్, ఇతర వివరాల్ని పరిశీలించి పుస్తకాల్లోని తప్పుల్ని అక్కడికక్కడే సరిదిద్దేలా ఏర్పాట్లు చేశామన్నారు. భూమి విస్తీర్ణం తప్పుగా నమోదైనా, చనిపోయిన వారి పేరుతో పాసు పుస్తకాల విడుదలైన వాటిని సరి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# 29 హెల్త్ సెంటర్ల నిర్మాణానికి 9.35 కోట్ల రూపాయలు మంజూరు.



మైలవరం మేజర్ న్యూస్ : మైలవరం నియోజకవర్గంలో 29 హెల్త్ సెంటర్ల నిర్మాణానికి 9.35 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. మైలవరం మండలంలోని వెల్వడం గ్రామంలో 15వ ఆర్థికసంఘం నిధులు రూ.36 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గ్రామాల్లోనే ఆరోగ్య మందిరముల నిర్మాణంతో ప్రజల సమగ్ర ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వీటిద్వారా ఉచిత మందులు, రోగనిర్ధారణ సేవలు, మాతా శిశు సంరక్షణ, మానసిక ఆరోగ్యం వంటి సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు వారి ఇంటి దగ్గర నాణ్యమైన సంరక్షణను అందుబాటులోకి తేవడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. హెల్త్ సెంటర్ నిర్మాణం నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాని మోదీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కారు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. పేదల జీవన ప్రమాణాల పెంపునకు కూడా సంక్షేమ పథకాల అమలు దోహదం చేస్తుందన్నారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తెలుగుదేశం పార్టీ నాయకులు కోమటి సుధాకరరావు, స్థానిక ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో విస్తృతంగా ఉపాధి గ్రామ సభలు




మొవ్వ మేజర్ న్యూస్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో అనేక మార్పులు చేస్తూ నూతన బిల్లును తీసుకురావడం జరిగింది. వికసిత్ జి రామ్ జి పేరుతో గత 20 సంవత్సరాలుగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చడం, కేంద్రం ఇచ్చే 90 శాతం నిధులను 60 శాతాన్ని కుదించటం, రాష్ట్రాలపై 40% భారం వేయటం, ఉపాధి హామీ పథకాన్ని రెండు పూటలా చేయాలని నిర్ణయించడం, 60 రోజులు సీలింగ్ విధించడం వంటి పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించటం, తదితర విధానాలను వ్యతిరేకిస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిడుమోలు, అవురుపూడి, చినముత్తేవి, కోసూరు, మొవ్వ, పెదసనగల్లు, వే ములమద, తదితర గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఆయా గ్రామసభల అధికారులకు సంతకాలతో కూడిన వినతి పత్రాలు సమర్పించడం జరిగినదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శీలం. నారాయణరావు తెలిపారు. ఈ గ్రామ సభల్లో మొవ్వలో శీలం కాటయ్య, కాకి రాజశేఖర్ గుర్విందపల్లి శేషగిరిరావు, కొక్కిలగడ్డ రామకృష్ణ, పెదముత్తేవి శ్రీనివాసరావు, కే వెంకటేశ్వరావు. నిడుమోలులో మద్దుల బసవరావు, ఉప్పలపు వెంకటాద్రి, కొనకళ్ళ నారాయణ, జి మాణిక్యాలరావు,పి సామ్రాజ్యం,కే శేషు కుమారి.కోసూరులో కొడాలి శ్రీనివాసరావు, దిమ్మెట సుబ్రహ్మణ్యేశ్వరావు, కే చుక్కమ్మ, సుశీల, వాణి, దగాని ప్రమీల రాణి, కృష్ణకుమారి, చలపతి రావు.చినముత్తేవిలో పి రంగారావు,ఎన్ వెంకటేశ్వరమ్మ,మాదాసు నాగులు,డి మణి,వి బసవ శంకర్రావు,పి వెంకటలక్ష్మి, జయరాజు. అవురుపూడిలోజొన్నలగడ్డ భాస్కరావు,సిహెచ్ రంగమ్మ,వీర్ల బాలకృష్ణ,డి వేణుబాబు, మాగంటి రామకృష్ణ, శికా సుబ్బారావు,బి శ్రీనివాసరావు. పెదసనగల్లులోఎం నాంచారయ్య,పి వెంకటేశ్వరరావు,కే సత్యవతి,బి ఆదినారాయణ,కే సులోచన,టి రమేష్,జే ఆశీర్వాదం,వేములమడలో వెంకటేశ్వరమ్మ,బొల్లా సుబ్రహ్మణ్యం, మురారి నాగరాజు, శొంఠి వెంకటేశ్వరరావు లు పాల్గొని వినతి పత్రాలు అందించారు.



## గ్రామ పంచాయతీకి ప్రింటర్ బహూకరించిన పిఎస్ఆర్

పామర్రు మేజర్ న్యూస్: మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామపంచాయతీకి మనం వనం ఫౌండేషన్ డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు ప్రింటర్ ను బహుకరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రింటర్ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విషయాన్ని ఆ గ్రామ ప్రజలు పలువురు శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి ప్రింటర్ ను కొనుగోలు చేసి సోమవారం గ్రామ సర్పంచ్ బందెల జెస్సికా శాంతకుమారి చేతుల మీదుగా పంచాయతీకి అందజేశారు. పంచాయతీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆయన స్వయంగా హెచ్.పి కలర్ ప్రింటర్ ను గ్రామానికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కె.రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బాపూజీ, పంచాయతీ సిబ్బంది, పలువురు గ్రామస్తులు, మనం వనం ఫౌండేషన్ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు గ్రామ సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

## పులిగడ్డ -వేకనూరు రోడ్డుకు నిధులు మంజూరు



అవనిగడ్డ, మేజర్ న్యూస్: మండల పరిధిలోని పులిగడ్డ నుండి వేకనూరు వరకు రోడ్డు అభివృద్ధి పనులకు రూ.కోటీ 53 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం తెలిపారు. స్టేట్ హైవేల అభివృద్ధిలో భాగంగా గుడివాడ - చల్లపల్లి - టీ.కొత్తపాలెం స్టేట్ హైవేలో అవనిగడ్డ మండలం పులిగడ్డ నుంచి వేకనూరు వరకు 49.6 కిలోమీటర్ నుంచి 58వ కిలోమీటర్ వరకూ 8.400 కిలోమీటర్లు పొడవున ఇంప్రూవ్‌మెంట్ (అభివృద్ధి) పనులకు ప్రభుత్వం రూ.కోటీ 53 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు.

## స్వర్గీయ మండలి విగ్రహానికి నివాళి



అవనిగడ్డ, మేజర్ న్యూస్: దివిసీమ అభివృద్ధి ప్రదాత స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి రేమాలవారిపాలెం గ్రామస్తులు ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం వంతెన సెంటర్లోని కృష్ణారావు విగ్రహానికి నాగాయలంక మండలం రేమాలవారిపాలెం గ్రేరామానికి చెందిన రేమాల నాగపోతరాజు, పేర్ల భీమేశ్వరరావు, రేమాల మిక్కిలినాయుడు, పేర్ల చిన్న, పేర్ల శ్రీహరి పులమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు ఎమ్మెల్యే తనయుడు యువ నాయకుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు లతోపాటు పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి



మైలవరం, మేజర్ న్యూస్ : మండలంలోని చంద్రగూడెం జంగాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయటానికి నూతన విగ్రహాలు ఇప్పించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు ఇంకొల్లు జమలయ్య మాట్లాడుతూ దాసులపాలెం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఇప్పించాలని వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషల్ లిస్ట్ పార్టీ మండల అధ్యక్షుడు పి ఏసురత్నం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పి ఏసురత్నం, ఏసు, కే రామారావు, పి రాంబాబు, కే ప్రేమ్ కుమార్, పలువురు పాల్గొన్నారు.

## దగ్గుపాటి పురందేశ్వరికి ఘన స్వాగతం



పామర్రు మేజర్ న్యూస్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుపాటి పురందేశ్వరికి పామర్రు మండల బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మచిలీపట్నంలోని కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆమెకు విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై పామర్రు వద్ద స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కృష్ణాజిల్లా బీజేపీ అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ ఆదేశాల మేరకు పామర్రు మండల కమిటీ ఆధ్వర్యంలో పురందేశ్వరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె పార్టీని బలోపేతం చేయడంలో ప్రతి నాయకుడు కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల బీజేపీ అధ్యక్షులు ముదునూరు శివకృష్ణ తో పాటు మండల కమిటీ సభ్యులు సిహెచ్.వీరాంజనేయులు, బి.కేశవ రావు, రాజేంద్రప్రసాద్, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యురాలు ఎం.కమల కుమారి, డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కైలాస, కె.హనుమ, జె.వి.ఎన్. రాజా రమేష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధితో పేదలకు ఆర్థిక భరోసా

**మైలవరం మేజర్ న్యూస్ :** సీఎం సహాయనిధితో అనారోగ్యంతో బాధపడు తున్న పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. మైలవరం పట్టణంలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఎల్.ఓ.సిలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు లబ్దిదారులకు సోమవారం అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితి ని తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు సందేశ పత్రాలను కూడా అందజే శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ తాజా గా మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు1485 మందికి రూ.12.29కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధిని అందజేసినట్లు వెల్లడించారు. తాజాగా నియోజకవర్గంలో 79 మందికి రూ.87 లక్షల సీఎంఆర్ఎఫ్ మం జూరు అయినట్లు వెల్లడించారు. వీటిలో 38 మందికి రూ.21.20 లక్షలు రీ ఎంబర్స్ మెంట్ చెక్కులు కాగా, 41 మందికి రూ.65.80 లక్షలు ఎల్. ఓ.సీల రూపంలో మంజూరు అయినట్లు వివరించారు. మైలవరం మండల పరిధిలో 12 మందికి రూ.5.60 లక్షలు తాజాగా మంజూరు అయినట్లు స్ప ష్టం చేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని అందరూ ఆరోగ్యంగా జీవించా లని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు రాని విద్యార్థులకు కౌన్సిలింగ్



**మొవ్వ మేజర్ న్యూస్:** కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరి యంటల్ పాఠశాలకు సక్రమంగా పాఠశాల రాని పిల్లలపై శ్రద్ధ పెట్టి వారి ఇంటికి వెళ్లి పిల్లలకు తల్లి దండ్రులకు విద్యాశాఖ అధికారు లు అవగాహన కల్పించారు. డి.వై.ఇ. ఓ పద్మారాణిఆదేశాలతో మండల విద్యాశాఖ అధికారి-2 కే. శ్రీ లక్ష్మి సోమవారం పెదపూడి లోని విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లి తోమాట్లాడారు. పదవ తరగతి చదువుతున్న కామిశెట్టి.శ్రావణి, ఆరవ తరగ తి చదువుతున్న రామిశెట్టి. కిరణ్ లు సక్రమంగా పాఠశాలలకు హాజరు కాకపోవడంతో ప్రధాన ఉపాధ్యాయురాలు అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, స్కూల్ అసిస్టెంట్ బండారు మాణిక్యాలరావు లతో కలసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. దీనితో పదవ తరగతి విద్యార్థి శ్రావణి సోమ వారం పాఠశాల హాజరుకాగా, కిరణ్ మంగళవారం నుంచి పాఠశాలకు పంపుతామని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపినట్లు ఎంఇఓ తెలిపారు.

## ఘనంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్లో ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో మచిలీపట్నంలోని డాక్టర్ల కు టుంబాలన్నీ కలిసి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా మొదట భోగి మంటలు వేసి సంబరాలు ప్రారంబించారు. వేద పండితుల ఆశీర్వచనంలతో పిల్లలకు భోగి పళ్ళు పోసి హారతులు ఇచ్చారు.అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో మైల ద్రువీక కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం సినిమా పాటలకు బాలబాలికలు నాట్య ప్రదర్శన, బాల బాలికలచే పాటకచేరి, సంగీత వాయిద్య ప్రదర్శన మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నంలోని ప్రముఖ వైద్యులు వారి కుటుంబాలు వారి పిల్లలు మనవళ్లు మనవరాలు అందరూ ఆనందంగా పాల్గొన్నారు.

## ప్రారంభమైన పరీక్షలు

**మొవ్వ మేజర్ న్యూస్:** ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగు రోజులు పాటు జరిగే ఎఫ్ ఏ- 111(సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్-పేపర్బి111) పరీక్షలు సోమవారం ప్రారంభమైయ్యా యి. మండలంలోని 12 ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలతోపాటు తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలు, పెదముత్తేవిలోని ఎయిడెడ్ ఉన్నత పాఠశాల,రెండు యూపీ పాఠశాలలు, 46 ఎంపీ ఎలిమెంటరీపాఠశాలలతో కలిపి 70 పాఠశాలల్లో ఈ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. 5వేలమందికిపైగా రాసే ఈ పరీక్షా కేంద్రాలనూఎంఈఓ-1 ఏ. భాను ప్రకాష్, ఎంఈఓ- 2 కే. శ్రీ లక్ష్మి పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

# జీఎస్టీను వ్యతిరేకస్తూ అఖిల భారత రైతుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ




**పల్నాడు జిల్లా, వినుకొండ, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై విధిస్తున్న జీఎస్టీను వ్యతిరేకస్తూ అఖిల భారత రైతుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పొగాకు సాగు రైతులు తో కలిసి శివయ్య స్తూపం వరకు ర్యాలీ కొనసాగగింది. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకుడు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై 50 నుండి 70 శాతం మేర జీఎస్టీ పెంపు నిర్ణయం పొగాకు రైతులకు శాపం గా మారిందని, కేంద్రం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జీఎస్టీ భారీగా పెంపు ద్వారా రైతులకు పంట అమ్ముకునే సమయంలో తీవ్రంగా నష్టపోతారని, దాంతో రైతాంగం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర దేశాల నుంచి అక్రమంగా తరలివస్తున్న పొగకు ఉత్పత్తులైన సిగరెట్ లను అరికట్టాలని, రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పెంపు ద్వారా రైతుల నుండి విరిసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీ పెంపు ద్వారా సిగరెట్ మొదలైన వాటి ధరలు అధికంగా పెరుగుతాయని తద్వారా వినియోగం గణనీయంగా తగ్గి రైతులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొగాకు రైతులు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## వికసిత్ భారత్ మన అందరి లక్ష్యం కావాలి....

**కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ.**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వికసిత్ భారత్ మన అందరి లక్ష్యం కావాలని, అదే మన సంకల్పంగా గ్రామ సీమలు పరిడవిల్లాలని కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు. అందరం సమైక్యంగా ఈ లక్ష్యసాధనకు చేరుకోవాలని అన్నారు. బందరు మండలం కానూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్, ఆజీవికా మిషన్ (గ్రామీణ్) విబిబిజిబిరామ్ జీ స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ గ్రామపంచాయతీ యొక్క గ్రామసభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గోపు సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం యొక్క మార్పు,అలాగే స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ గ్రామపంచాయతీ యొక్క ఆవశ్యకత గూర్చి చాలా విపులంగా గ్రామ ప్రజలకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి పి శ్రీహరి, విఆర్ఓ సుబ్బయ్య దాసు సచివాలయ సిబ్బంది, ఇతర గ్రామ పెద్దలు పీత రాము, దివి మహేష్, చక్కా ఏడుకొండలు, బొలిశెట్టి నాని, వి.చిన్నా డ్వాక్రా సంఘం బుక్ కీపర్లు,అంగన్ వాడి కార్యకర్తలు, ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఫిర్యాదులు చట్టపరిధిలో పరిష్కారం అందించేలా చర్యలు

**జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు**



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక “మీకోసం” కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు హాజరయి వారి సమస్యను ఎస్పీకి సమర్పించగా,జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి,వారి సమస్యలను సానుకూలంగా విని పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. మీకోసం కార్యక్రమం ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక శ్రద్ధ కనపరిచి, చట్టపరిధిలో పూర్తి స్థాయి విచారణ నిర్వహించి న్యాయసమ్మత పరిష్కారం అందిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.ప్రజా ఫిర్యాదుల విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.సోమవారం వివిధ రకాల సమస్యలతో మొత్తం 30 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో జిల్లా ఎస్పీకి సమర్పించారు.ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు బదిలీ చేసి, పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలి...





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల నుండి అందే అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో సానుకూలంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కేఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మెప్మా పీడీ సాయిబాబు, డిఎస్పి శ్రీనివాసరావులతో కలసి సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ ఎంతో ఓపికగా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 132 అర్జీలను ప్రజల నుండి జిల్లా యంత్రాంగం స్వీకరించింది. కృత్తివెన్ను మండలం మట్లం గ్రామానికి చెందిన బర్రి ధనుంజయ్ తనకు 15 సంవత్సరాల వయస్సు అని, 90 శాతం వికలత్వం ఉందని ప్రభుత్వ వైద్యులు ధృవీకరించారని పింఛను మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. జిల్లా కలెక్టర్ మానవత్వంతో ఒక చక్రాల కుర్చీని వెంటనే తెప్పించి అందులో అతనిని కూర్చునే ఏర్పాటు చేశారు. బంటుమిల్లి మండలం అత్తమూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బీమవరపు చిట్టెమ్మ తనకు పింఛను మంజూరు చేయాలని కోరుతూ అర్జీ జిల్లా కలెక్టర్కు అందజేశారు.ముఖ్యంగా దివ్యాంగుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డి ఆర్ డి ఎ పి డి హరిహరనాదుకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ సోమశేఖర్, డిఆర్ డి ఎ పిడి హరిహర నాథ్, జెడ్పిసిఈఓ కే కన్నమ నాయుడు, ఆర్ అండ్ బి ఈ ఈ లోకేష్, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, డిఎస్ఓ మోహన్ బాబు, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, జిల్లా ఉద్యాన అధికారి జే జ్యోతి, ఐ సి డి ఎస్. పి డి ఎం ఎన్ రాణి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లో-వోల్టేజ్ సమస్యకు చెక్..



**గన్నవరం, జనవరి 5, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా లో–వోల్టేజీ సమస్యను రూపుమాపి, రైతులకు పగటిపూట 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. సోమవారం గన్నవరం విమానాశ్రయ పరిధిలో ఏపీ ట్రాన్స్‌కో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, సి పి డి సి ఎల్ సి ఎం డి పుల్లారెడ్డి, ఏపీ ట్రాన్స్కో జే ఎం డి సూర్య సాయి ప్రవీణ్ కృష్ణాజిల్లా సంయుక్త కలెక్టర్ నవీన్ లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేపదే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని, కానీ తమ ప్రభుత్వం చరిత్రలో తొలిసారిగా 'ట్రూ అప్' చార్జీలకు బదులుగా 'ట్రూ డౌన్' ద్వారా యూనిట్‌కు 13 పైసలు తగ్గించిందని మంత్రి గుర్తుచేశారు. భవిష్యత్తులో చార్జీలు పెంచే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇళ్లపై సోలార్ ఏర్పాటుకు రూ. 78 వేల వరకు రాయితీ ఇస్తున్నామని, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు అదనపు రాయితీతో సోలార్ విద్యుత్తును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ పంపిణీ నష్టాలను 18 శాతం నుండి 11 శాతానికి తగ్గించామని, దీనిని మరింత తగ్గించేందుకు సంస్కరణలు చేపడుతున్నామని వెల్లడించారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ కొత్తగా 75 వేల బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ.. విమానాశ్రయ అవసరాలతో పాటు గన్నవరం, విజయవాడ గ్రామీణ, కంకిపాడు మండలాల పరిధిలోని సుమారు 88 వేల సర్వీసులకు ఈ కొత్త సబ్ స్టేషన్ ద్వారా మేలు జరుగుతుందని తెలిపారు. దీనివలన కొన్ని లో వోల్టేజ్ సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయముతో పాటు గృహ అవసరాలకు దృష్టిలో ఉంచుకొని అధిక స్థాయి వోల్టేజ్ సామర్థ్యంతో నేడు 132/3 కెవి గన్నవరం విమానాశ్రయం విద్యుత్ ఉపకేంద్రాన్ని 31 కోట్ల రూపాయల వ్యయంతో నెలకొల్పామన్నారు. గన్నవరం, విజయవాడ గ్రామీణ, కంకిపాడు మండలాల పరిధిలో గృహ సర్వీసులు 62 వేలు, వాణిజ్య సర్వీసులు 18, వేలు, పారిశ్రామిక సర్వీసులు 2 వేలు, వ్యవసాయ సర్వీసులు 6వేలు మొత్తం సుమారు 88 వేల సర్వీసులు లబ్ధి పొందుతున్నాయన్నారు. దీంతో గంగూరు విద్యుత్ ఉపకేంద్రంపై లోడ్ కూడా తగ్గుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఉద్దేశంతో ఉన్నారన్నారు. ఇందులో భాగంగానే ట్రాన్స్మిషన్ నష్టాలు రాకుండాలని రాకుండా ఉండేందుకు వాణిజ్య రంగాల్లో అవసరాలను గుర్తించి కొత్తగా విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. మల్లవల్లి పారిశ్రామిక వాడ, రామవరప్పాడు, బాపులపాడు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్ స్టేషన్లను మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 10 వేల సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేసేందుకు చొరవ చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. తన నియోజకవర్గంలోని పురుషోత్తమ పట్నం 70 సంవత్సరాల కిందట స్వాతంత్రం రాకమునుపే విద్యుత్తు లైన్ ఉండేదని శాసనసభలో ప్రస్తావించామన్నారు. దాన్ని ఒకసారి మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిశీలించాలని కోరుతున్నామన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో విద్యుత్ సమస్యతో పరిశ్రమలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పిన వెంటనే ఇంధనశాఖ మంత్రివర్యులు స్పందించి 132/33 కెవి విద్యుత్ కేంద్రం మంజూరుకు ఆమోదం తెలిపినందుకు మంత్రికి, ప్రధాన కార్యదర్శికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే రామవరప్పాడు లో రెండు 32 కెవి విద్యుత్ ఉప కేంద్రాలు, బాపులపాడు లో ఒక విద్యుత్ కేంద్రం అడిగిన వెంటనే మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తన నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, విద్యుత్ ఉప కేంద్రాలకు స్థలాల కేటాయింపులో భూ సమస్య ఉందన్నారు. కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి త్వరగా విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం మంత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. అలాగే విద్యుత్ శాఖ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డైరెక్టర్లు ఏ కె వి భాస్కర్, జే వి రావు, వెంకట రమణమూర్తి, విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్ కే రెడ్డి, విద్యుత్ శాఖ సీఈ సుదీవన్, ఎస్.ఈ. భాగ్యరాజ్, ఈ ఈ జయకర రాయ్, గన్నవరం తహసిల్దారు శివయ్య, ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహా రావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, బీజేపీ నాయకులు కురుమద్దాలి ఫణికుమార్, జనసేన నాయకులు చిమటా రవివర్మ, టిడిపి నాయకులు గొద్దళ్ల చిన్నరామారావు, చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయి కళ్యాణి, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ రావు, మువ్వ వెంకటేశ్వరరావు, గుజ్జర్లపూడి బాబురావు, వేములపల్లి శ్రీనివాసరావు, మేడేపల్లి రమ, అన్నే హరికృష్ణ, జాస్తి శ్రీధర్, లంకే రంగారావు, కొండేటి వెంకటేశ్వరరావు, తంగిరాల శ్రీనివాసరావు, మువ్వ వేణుగోపాల్, చిన్నాల లక్ష్మీ నారాయణ, కర్రా ప్రసాద్ పాల్, పలువురు విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల సహకారంతోనే కూటమి అధికారంలోకి వచ్చింది



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. స్థానిక వెన్యూ కన్వెన్షన్ హాల్ లో ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ – 2026 డైరీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయి డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. ఉద్యోగుల సహకారంతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఏఈ ల కొరతకు సంబంధించి కూటమి ప్రభుత్వం నుంచి త్వరలోనే ఉద్యోగులు శుభవార్త వింటారని మంత్రి హామీ ఇచ్చారు. అదే విధంగా పీఆర్సీతో పాటు ఇంజనీర్ల కొరత అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లానని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యుత్ రంగానికి సంబంధించి లైన్ మెన్ నుంచి ఇంజనీర్ వరకు అందరూ కష్టపడితేనే ప్రజలకు ట్రూ డౌన్ రూపంలో ఊరట లభించిందన్నారు. దేశంలో మొదటిసారి విద్యుత్ ఛార్జీలను ట్రూ డౌన్ చేసిన చరిత్ర సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మరోవైపు గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పేరుతో బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేసిందని మంత్రి విమర్శించారు. అవసరంలేని పవర్ పర్చేజ్ లతో గత ప్రభుత్వం 9 సార్లు కరంటు చార్జీలను పెంచి ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపిందని ఆయన ఆరోపించారు. విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ ఇన్సూరెన్స్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని మంత్రి గొట్టిపాటి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. విద్యుత్ రంగం గొప్పదనాన్ని ప్రభుత్వం గర్వంగా చెప్పుకోవడానికి ప్రధాన కారణం ఉద్యోగుల కష్టమే అని ఆయన గుర్తు చేశారు. ఏపీ జన్ కో లో రికార్డు స్థాయిలో 6,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రానికే గర్వకారణమని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేసిన విద్యుత్ సంస్కరణలతోనే 7, 8 గంటల విద్యుత్ అంతరా యాల నుంచి 24 గంటలూ నిరంతర విద్యుత్ సరఫరా అందించే స్థాయికి వచ్చామన్నారు. అదే విధంగా శ్రీకాకుళంలో నూతన పవర్ ప్లాంట్ నిర్మాణ నికి సంబంధించి సానుకూల నిర్ణయం వచ్చేలా స్థానికులతో చర్చిస్తామని చెప్పారు. వినియోగదారులకు నిరంతర సేవలు అందిస్తూ, నాణ్యమైన విద్యుత్ అందిస్తూ, విద్యుత్ సరఫరా లాస్ ను తగ్గించడం ద్వారా వినియోగదారులకు విద్యుత్ రేట్లు తగ్గే అవకాశం ఉందన్నారు. ఏపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. శామ్యూల్ మాట్లాడుతూ ఎన్నో యేళ్లుగా పరిష్కారం కాని విద్యుత్ ఉద్యోగుల సమస్యలను హామీ ఇచ్చిన ఆరు నెలల్లోనే చాలా వరకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిష్కరించారన్నారు. మా అసోసియేషన్ కు దాదాపు 50 సంవత్సరాలపైబడి చరిత్ర ఉందన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ లాంటి వ్యక్తులు విద్యుత్ శాఖ మంత్రిగా రావడం ఉద్యోగులకు సంతోషదాయకమన్నారు. గత ప్రభుత్వంలో పే రివిజన్ లో అందరికీ జీతాలు పెరిగితే మాకు తగ్గాయని, రాబోయే పే రివిజన్ లో అయినా మాకు న్యాయం చేయాలని కోరారు. ఏపీఎస్ఈబి ఇంజనీర్స్ జనరల్ సెక్రటరీ కే. నాగ ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల కోసం ఏపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ 1959 వ సంవత్సరం నుంచి పనిచేస్తుందన్నారు. ఈ అసోసియేషన్ లో ఎంతోమంది ఉద్దండులు ఉద్యోగుల హక్కుల కోసం పనిచేసారన్నారు. పే రివిజన్ అంటే ఇప్పుడు ఉద్యోగులు భయపడుతున్నారని, గత ప్రభుత్వంలో ఇచ్చిన పే రివిజన్ లో విద్యుత్ ఉద్యోగులకు అన్యాయం జరగటమే కారణమన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటూ సహకరించాలన్నారు. ఏపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ కే.వి రామారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమైన తక్కువ రేట్లకు నాణ్యమైన విద్యుత్ ను ప్రజలకు అందించేందుకు మా వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి, ఏపీసీపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ మురళీ కృష్ణ యాదవ్, ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ చైర్మన్ సైలేంద్ర దూబే, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ చట్టం బీసీలఆత్మగౌరవానికి రక్షణ కవచం...

**జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు**




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బీసీ నాయకులు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు మాట్లాడుతూ బీసీల రక్షణ చట్టం బీసీల ఆత్మగౌరానికి రక్షణ కవచమని కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బీసీ వర్గాలు హర్షం ప్రకటించాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చట్టం ముసాయిదా రూపకల్పనకు శ్రీకారం చుడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బీసీల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్రంలో 138 బీసీ కులాల మద్దతు కూటమి ప్రభుత్వానికి లభిస్తుందని బీసీలకు మంచి రోజులు రాబోతున్నాయి అన్న ఆశాభావం ఉందని, ఆత్మగౌరవంతో జీవించడానికి బీసీ రక్షణ చట్టం దోహదపడుతుందని గడ్డంరాజు పేర్కొన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగాల్సిన అవశ్యకత ఉందని బీసీల్లో రాజకీయ ప్రాధాన్యత లేని వెనుకబడిన కులాలను గుర్తించి చట్టసభల్లో స్థానిక సంస్థల్లో వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీల్లో కొన్ని కులాలు మాత్రమే రాజకీయంగా ఎదిగాయని ఆర్థిక వనరులు లేని కారణంగా నేటికీ కొన్ని కులాలు రాజకీయ అరంగేట్రం చేయలేదని వారిని కూటమి ప్రభుత్వం గుర్తించి స్థానిక సంస్థల్లో కోఆప్షన్ పదవులకు నిబంధనలను సవరించి రాజకీయంగా ప్రోత్సాహాన్ని అందించాలని గడ్డంరాజు కూటమిని కోరారు.

## ఆవకాయ్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఆవకాయ్.. సినిమా, సంస్కృతి, సాహిత్య అమరావతి ఉత్సవాలకు సమన్వయ శాఖల అధికారుల భాగస్వామ్యంతో పకడ్బందీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు.. టీమ్‌వర్క్స్ (సెలబ్రేటింగ్ ది ఆర్ట్స్) సంస్థ ప్రతినిధి సయ్యద్ శామ్స్‌తో కలిసి సోమవారం పున్నమిఘాట్‌ను సందర్శించారు. కార్యక్రమాల షెడ్యూల్, వేదికల వద్ద సీటింగ్ అరేంజ్‌మెంట్, సందర్శకుల భద్రత, ట్రాఫిక్ ప్రణాళిక, వేదికల వద్ద ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లతో పాటు చేయాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కలిసికట్టుగా ఆవకాయ్ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. దసరా ఉత్సవాలు, భవానీ దీక్షా విరమణల సందర్భంగా ఆధునిక సాంకేతికత సహకారంతో భక్తుల భద్రతకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడంతో ఇదే స్ఫూర్తితో ఆవకాయ్ ఉత్సవాలకు తరలివచ్చే సందర్శకుల భద్రతకు పెద్దపీట వేస్తూ భద్రతా ప్రణాళికల అమలుకు సీపీ రాజశేఖరబాబు పోలీసు అధికారులకు సూచనలు చేశారు.

## మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం



### ఆరోగ్య ఆంధ్ర సాకారానికి కలిసికట్టుగా కృషిచేయాలి

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

మైలవరం, మేజర్ న్యూస్ : ఆరోగ్య ఆంధ్ర సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందని.. ఈ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సోమవారం మైలవరంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రి వార్డులు, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఫార్మసీ తదితరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిబద్ధతతో సేవలందించాలని.. రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

# సమగ్ర కులగణన చేపట్టిన తర్వాతే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



**విజయవాడ మేజర్ న్యూస్ :** సమగ్ర కులగణన చేపట్టిన తర్వాత మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రభుత్వానికి తగు ఆదేశాలు జారీ చేయాలని అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు సోమవారం హైకోర్టులో వాజ్యం వేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ (డబ్ల్యు.పి.నెం.36399/2025) విచారణకు వచ్చిన సందర్భంగా పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వాదనలు వినిపిస్తూ.., సమగ్ర కులగణన చేపట్టి, బీసీల జనాభా లెక్కలు వెల్లడించిన తర్వాతనే స్థానిక సంస్థలు నిర్వహించాలని, అందుకు అనుగుణంగా తగు ఆదేశాలు జారీ చేయవలసిందిగా వాదనలు వినిపించినట్లు తెలిపారు. అలాగే వెనుకబడిన కులాల వారు జనాభా ఎంత.. ? ఆ జనాభాకు తగిన విధంగా విద్య, ఉద్యోగ సమస్త జీవన రంగాల్లో వారి జనాభాను బట్టి, వారికి కేటాయింపులు జరిగే విధంగా కూడా ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోర్టులో తన వాదనలు వినిపించారన్నారు. పిటిషనర్ల వాదనలను పరిగణలోనికి తీసుకున్న న్యాయమూర్తి కుల గణనకు సంబంధించి ' డెడికేటెడ్ కమిషన్' ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసు కుంటున్నారు అనే విషయాలు కోర్టు వారికి తెలియజేయవలసిందిగా., ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం సంక్రాంతి సెలవులు అనంతరం 19.1.2026 తారీకు వాయిదా వేయడం జరిగిందని ఆలా వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ ఆలా వెంకటేశ్వర్లు వెంట ఏపీ బీసీ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు. హైకోర్టు న్యాయవాదులు తోట శివరాం ప్రసాద్, వీర్ల వేణుగోపాల్, సైకం రాజశేఖర్, శరత్ కుమార్, బి.శ్రీనివాస రావు, మునిరాజ్, శ్రీకాంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 'వీబీ- జీ రామ్ జీ'తో ఉపాధికి మరింత గ్యారంటీ

## ఉపాధి హామీ కూలీలకు 125 రోజుల పనిదినాలు

## పథకం అమల్లో జవాబుదారీతనం, పారదర్శకత




**మైలవరం మేజర్ న్యూస్ :** వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)' ('వీబీ- జీ రామ్ జీ') తో ఉపాధికి మరింత గ్యారంటీ లభిస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మైలవరం మండలంలోని వెల్వడం గ్రామంలో 'వీబీ- జీ రామ్ జీ' పథకంపై సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ వికసిత్ భారత్-2047 మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా, ఆధునిక గ్రామీణ అవసరాలకు తగినట్లుగా పాత పథకంలో మార్పులు చేసి ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయటానికి సిద్ధంగా ఉన్న కూలీలకు ఈ చట్టం సంవత్సరంలో 125 రోజులు ఉపాధికి హామీ ఇస్తుందన్నారు. దీని ద్వారా వారి ఆదాయాన్ని 25 శాతం పెంచుతుందన్నారు. ఉపాధికి హామీ ఇవ్వటం ద్వారా కరువు కారణంగా ఏర్పడే ప్రజల వలసలను నివారిస్తుందన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రధానంగా ప్రజలకు నీటి భద్రత, గ్రామీణ ప్రధాన మౌలిక వసతులు, జీవనోపాధి మౌలిక వసతులు, వాతావరణ పరిస్థితులను స్థిరీకరించే (వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్ప్రభావాలను నిరోధించటం) పనులు అనే నాలుగు అంశాలపై ఈ పథకం దృష్టి పెట్టిందన్నారు. ఈ పథకం చెరువులు, కుంటల వంటి నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నీటి వనరుల పునరుద్ధరణ ద్వారా వ్యవసాయానికి నీటి వసతితోపాటు భూగర్భ జల మట్టం పెంచేందుకు వీలు కలుగుతుందన్నారు. పక్కా రోడ్లు, గ్రామాల అనుసంధానం, అత్యవసరమైన సేవల కల్పన ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిస్తుందన్నారు. డిజిటల్ హాజరు, కూలీలకు నేరుగా వేతనాల చెల్లింపు, డాటా ఆధారిత ప్రణాళికల ద్వారా జవాబుదారీతనాన్ని పెంచుతుందన్నారు. పంటలు వేసే, కోసే కాలాల్లో రైతులకు కూలీల కొరత రాకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు 60 రోజుల పాటు పనులను నిలిపివేసే అవకాశం ఈ పథకం కల్పిస్తుందన్నారు. అవినీతి నిరోధానికి, మోసాలను గుర్తించేందుకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థతో పథకంపై పర్యవేక్షణకు కేంద్ర, రాష్ట్రాల సంయుక్త స్టీరింగ్ కమిటీ ఉంటుందన్నారు. ఈ పథకంపై గ్రామ పంచాయతీ పర్యవేక్షణ అధికారాలను విస్తృతం చేయటంతో పాటు జీపీఎస్, మొబైల్ ఆధారిత పర్యవేక్షణ ఉంటుందన్నారు. తద్వారా పథకం అమలులో పారదర్శకత ఉంటుందన్నారు. ఈ పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తెలుగుదేశం పార్టీ నాయకులు కోమటి సుధాకరరావు, ఎన్డీఏ కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు విద్యుత్ సంస్కరణలతో ప్రజలకు ఊరట గద్దె అనురాధ

## ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం



**విజయవాడ మేజర్ న్యూస్ :** సీఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణలతో వైసిపి ప్రభుత్వం మోపిన విద్యుత్ చార్జీల అదనపు భారం నుంచి ప్రజలకు ఊరట లభించిందని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా చేపడుతున్న విద్యుత్ సంస్కరణలు ప్రజలకు తెలియజేసేందుకు సోమవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో గద్దె అనురాధ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్‌గా ముందుకు సాగుతున్నాయని అన్నారు. మేనిఫెస్టోలో పేర్కొనకపోయినా, ప్రజలపై భారం తగ్గించాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీలను తగ్గించి గొప్ప నిర్ణయం తీసుకున్నారని ఆమె కొనియాడారు. 2019లో వైఎస్ జగన్ అధికారం చేపట్టే నాటికి ఆంధ్రప్రదేశ్‌ను మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిపిన ఘనత చంద్రబాబుదేనని గుర్తుచేశారు. అయితే, వైఎస్ జగన్ తన అవివేకపూరిత నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని పూర్తిగా అప్పులపాలు చేశారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని హామీలు ఇచ్చిన జగన్, ఐదేళ్ల పాలనలో ఐదు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలపై సుమారు రూ.32 వేల కోట్ల భారం మోపారని గద్దె అనురాధ ఆరోపించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యమైన విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సమగ్ర సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. గత ప్రభుత్వం మిగిల్చిన వేల కోట్ల రూపాయల ట్రూ అప్ భారాన్ని ప్రజలపై మోపకుండా, కూటమి ప్రభుత్వం పూర్తిగా భరించిందని స్పష్టం చేశారు. తొలిసారిగా ట్రూ డౌన్ ఛార్జీలు నమోదు కావడం సీఎం చంద్రబాబు తీసుకుంటున్న విద్యుత్ సంస్కరణల ఫలితమని పేర్కొన్నారు. ట్రూ డౌన్ అమలుతో యూనిట్‌కు 13 పైసలు విద్యుత్ చార్జీలు తగ్గించగలిగామని తెలిపారు. జగన్ పాలనలో అక్వా రైతులపై యూనిట్‌కు రూ.3.50 భారంగా మోపితే, కూటమి ప్రభుత్వం యూనిట్‌కు రూ.1.50 తగ్గిస్తూ రైతులకు పెద్ద ఊరట కల్పించిందని చెప్పారు. రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ, సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ ధరలకు విద్యుత్ కొనుగోలు చేస్తూ ప్రజలపై భారం తగ్గిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం యూనిట్ విద్యుత్‌ను రూ.5.19లకు కొనుగోలు చేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.4.70లకే కొనుగోలు చేస్తోందని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఇంకా విద్యుత్ చార్జీలు తగ్గించే అవకాశం ఉందని గద్దె అనురాధ తెలిపారు.




## ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పారామిలిటరీ సైనికుల కోసం పెన్షనర్ హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పారామిలిటరీ సైనికుల సంక్షేమ సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు సంబంధించిన అన్ని సంక్షేమ అంశాలను సమగ్రంగా పొందుపరిచిన ప్రత్యేక హ్యాండ్‌బుక్ "సర్వీస్ సాక్రిఫైస్ సర్టిఫికెట్ వెల్ఫేర్ ఆఫ్ పారామిలిటరీ సోల్జర్స్" స్వర్గీయ బి.ఎస్.ఎఫ్ జవాన్ ఎం.ఈశ్వర్, స్వాతి ఘనంగా ఆవిష్కరించినట్లు సంఘం జనరల్ సెక్రెటరీ కనతరపు చంద్ర కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ ఈ హ్యాండ్‌బుక్ ద్వారా విశ్రాంత పారామిలిటరీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు తమకు లభించే సంక్షేమ పథకాలు హక్కులు, సౌకర్యాలపై స్పష్టమైన అవగాహన పొందగలరని తెలిపారు.

## సుద్ద ముక్కపై పుస్తక మహోత్సవం అని రాసిన రాఘవేంద్ర బాబు





**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడలో పుస్తక ప్రదర్శన జరుగుతున్న సందర్భంగా సుద్ద ముక్కపై పుస్తక మహోత్సవం అని చెప్పి రాసి ఇక్కడ ప్రెసిడెంట్ కి అందజేసినట్లు కోడూరి నాగ రాఘవేంద్ర బాబు అనే ఎంబీఏ విద్యార్థిని సోమవారం మీడియాకు తెలిపారు. జీవితంలో పుస్తకాలు ఎంతో దోహదపడతాయని, తనకు ఇలాంటి సుద్ద ముక్కపై చెక్కడానికి సమయం మూడు రోజులు పట్టినట్లుగా రాఘవేంద్ర బాబు తెలిపాడు. తాను గతంలో మంత్రి నారా లోకేష్ పేరు రాసినట్లుగా తెలియజేశాడు.

## పూర్వపు ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లపై జంపాన శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ఉయ్యూరు నగర పంచాయతీలో 2024-2025 సం. రాలలో అప్పటి నగర పంచాయతీ కమీషనర్ పాయసం వెంకటేశ్వరరావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ వేదాంతం రఘు బాబు, నగరపంచాయితీ పరిధిలోని బిల్డింగులకు ఆస్తిపన్నులను ఆన్లైన్లో కాకుండా నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్గా ఇస్తూ, నగరపంచాయితీ నిధులకు ఆస్తిపన్నులు జమ చేయలేదు.అప్పటి ఉయ్యూరు నగరపంచాయతీ పాయసం వెంకటేశ్వరరావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ వేదాంతం రఘుబాబులపై విచారణ, క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999